# పోతారం శివాలయంలో ఎమ్మెల్యే పూజలు



పోతారంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి 10: మండలంలోని పోతారంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా శివాలయం నిర్మించారు. సోమవారం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే తన స్వగ్రామంలో శివాలయ నిర్మాణంపై సంతోషం వ్యక్తం చేశారు. దేవాలయ నిర్మాణం కోసం కృషి చేసిన రెడ్డి సంఘం నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గణపతి, నంది విగ్రహాలతో పాటు ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించారు. శివపార్వతుల కల్యాణంతో పాటు ప్రత్యేక పూజలు కొనసాగాయి. భక్తులకు అన్నదానం చేశారు.

# రేణుకా ఎల్లమ్మతల్లి వార్షికోత్సవం



ఎల్లమ్మతల్లిని దర్శించుకున్న యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 10: పట్టణంలోని రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, నాయకులు గుంటుక రాజు, చందులు తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



వర్గల్ మల్లిఖార్జునస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

వర్గల్, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలో మల్లిఖార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు సోమవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి హాజరై మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, మాజీ జడ్పీటీసీ బాలమల్లుయాదవ్, మాజీ ఎంపీపీ లతారమేశ్ గౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వేలూరి కృష్ణారెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బాలమురళీగౌడ్, పార్టీ ఉపాధ్యక్షుడు తుమ్మ గణేశ్ పాల్గొన్నారు.

# చేతివృత్తిదారుల సంక్షేమానికి కృషిచేయాలి



మహాధర్నాలో పాల్గొన్న చేర్యాల మండల కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 10: ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాకు మండలానికి చెందిన ప్రజా సంఘాల నాయకులు, కల్లు గీత కార్మిక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్ మావో, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మార్చిలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో చేతివృత్తిదారుల సంక్షేమానికి రూ.25వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి దండ్ల రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మల్కాని ఎల్లయ్య, గుండ్ర రవీందర్, గర్నెపల్లి చంద్రం, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు మైసంపల్లి రాహుల్, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పెయింటర్స్ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



ముస్త్యాల పెయింటర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

చేర్యాల, ఫిబ్రవరి 10: నిత్యం ప్రమాదం అంచున భవనాల్లో పని చేస్తున్న పెయింటింగ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముస్త్యాల పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడు ముస్కు శ్రీకాంత్ కోరారు. మండలంలోని ముస్త్యాలలో సోమవారం పెయింటర్స్ యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముస్కు శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా చేర్యాల హరిబాబు, అశోక్, ప్రధాన కార్యదర్శిగా చేర్యాల ప్రశాంత్, కోశాధికారులుగా పెద్దింటి మహేందర్, రమేశ్, కార్యవర్గ సభ్యులుగా బాబురావు, సురేందర్, రమేశ్, శివకుమార్, రాజుకుమార్, శ్రీకాంత్, సాగర్, సీహెచ్.రాజు, హరిబాబు, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

# హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం పర్యటన



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 10: హుస్నాబాద్ పట్టణంలో సోమవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా నాగారం రోడ్డు, బస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పలువురితో ముచ్చటించారు. జాతీయ రహదారి విస్తరణతో స్థలాలు కోల్పోతున్న బాధితులతో ఆయన మాట్లాడారు. వ్యాపారాలు ఎలా నడుస్తున్నాయి, ఎంతవరకు స్థలాన్ని కోల్పోతున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందు, పలువురు నాయకులు ఉన్నారు.

# జాతీయ రహదారి పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ మనుచౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి10: నేషనల్ హైవే రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి నేషనల్ హైవే అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌కాన్ఫరెన్స్‌హాల్‌లో నేషనల్ హైవే ఇంజినీర్, కాంట్రాక్టర్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ ఎల్కతుర్తి నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా సిద్దిపేట నుంచి జిల్లా పరిధి చివరి వరకు నేషనల్ హైవే నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేయాలన్నారు. హుస్నాబాద్ టౌన్‌లో వాటర్ పైప్‌లైన్, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తిచేసి జంక్షన్ డెవలప్‌మెంట్ పనులు మొదలు పెట్టాలని సూచించారు. పందిల్ల దగ్గర బ్రిడ్జి నిర్మాణం పనుల్లో వేగం పెంచాలన్నారు. పందిల్ల–కూచన్‌పల్లి వద్ద టోల్‌గేట్ నిర్మాణానికి రెవెన్యూ అధికారుల సహకారంలో భూ సేకరణ పనులు పూర్తి చేయాలన్నారు. గ్రావెల్ ఫిల్లింగ్ కోసం ఇతర శాఖల నుంచి అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, నేషనల్ హైవే ఏఈలు అనురాగ్, శ్రీనివాస్‌రావు, కాంట్రాక్టర్ నేమి చందు పాల్గొన్నారు.

**ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి**

పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జిల్లా మేనేజర్ ఆనంద్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు పాటించాలన్నారు. ఎన్నికల్లో పాల్గొనే అధికారులు,సిబ్బందికి ఎన్నికల విధులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, జిల్లా పంచాయతీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలి



పోతిరెడ్డిపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్

చేర్యాల, ఫిబ్రవరి 10: త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా ప్రజలు సహకరించాలని హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ కోరారు. మండలంలోని పోతిరెడ్డిపల్లిలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అన్ని వర్గాలు పాల్గొనాలని, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు.గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లేదా 100కు కాల్ చేయాలని కోరారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ జరిపారు. సీఐ శ్రీను, ఎస్సై నీరేశ్ తదితరులు ఉన్నారు.


# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి శ్వేతారెడ్డి

బెజ్జంకి, ఫిబ్రవరి 10: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, జడ్జి స్వాతి రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని క్రాసింగ్ కృపాభవన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సమస్యలుంటే నేరుగా పోలీసులు, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం భవనంలోని వసతులను ఆమె పరిశీలించారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఎస్సై శంకర్‌రావు, ప్యానల్ అడ్వకేట్ లింగయ్య, పారాలీగల్ వలంటీర్ విష్ణుమూర్తి తదితరులు ఉన్నారు.

# ఉద్యాన పంటలసాగు లాభదాయకం



ఉద్యాన పంటల సాగులో డ్రోన్ ఆవశ్యకతపై అధికారులకు వివరిస్తున్న వీసీ రాజిరెడ్డి

ములుగు, ఫిబ్రవరి 10 : సాంకేతికంగా ఉద్యాన పంటలసాగు లాభదాయకమని ఉద్యానవర్సిటీ వీసీ డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో సోమవారం కోరమండల్ ఇంటర్‌నేషనల్ లిమిటెడ్, దక్ష రిమోట్ పైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ సంస్థలతో సమావేశం ఏర్పాటు చేశారు. వర్సిటీలో డ్రోన్ సెంటర్ ఏర్పాటు, ఉద్యాన పంటలసాగుకు డ్రోన్ టెక్నాలజీ అప్లికేషన్స్ సహకారం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉద్యానరంగంలో సాంకేతికతను అభివృద్ధి చేస్తే పంట పర్యవేక్షణ, తెగులు నియంత్రణ, పోషక నిర్వహణ తదితర అంశాల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, కోరమండల్ ఇంటర్‌నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, జీఎం రామకృష్ణ, వర్సిటీ డీన్ రాజశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

# పట్టభద్రులు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలి



నినాదాలు చేస్తున్న పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, పట్టభద్రులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 10: నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలని పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ కోరారు. సోమవారం సిద్దిపేట మున్నూరు కాపు సంక్షేమ సంఘం భవనంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పట్టభద్రులు, నిరుద్యోగులు ప్రసన్న హరికృష్ణకు మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉన్నతమైన ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పట్టభద్రుల హక్కుల సాధన కోసం ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారన్నారు. పట్టభద్రులు,నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో పట్టభద్రులందరూ తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుడు, పట్టభద్రుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుమ్మోజు జగదీశ్వరాచారి,పట్టభద్రులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ కీలకమైంది




చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐలు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 10: విద్యార్థి దశ కీలకమైందని, విద్యార్థులు చదువుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. బీఎంఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం చట్టాలపై విద్యార్థులకు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావొద్దన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ దవాఖానకు ఫ్రీజర్ అందజేత



దవాఖానకు ఫ్రీజర్ అందజేస్తున్న ఐవీఎఫ్ నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 10: గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోలి వెంకటేశం, తోట భూమలింగం, ఆదిమూలం రాములు జ్ఞాపకార్థం ఫ్రీజర్‌ను వారి కుటుంబ సభ్యులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఐవీఎఫ్ నాయకులు గోలి సంతోష్‌గుప్తా, భిక్షపతి, నారాయణ పాల్గొన్నారు.

# ముడిసరుకుల ధరలు తగ్గించాలి



నినదిస్తున్న సంఘం నాయకులు


హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 10: ఇంటి అలంకరణ వస్తువుల తయారీకి సంబంధించిన ముడిసరుకుల ధరల పెంపునకు నిరసనగా హుస్నాబాద్‌లో విశ్వబ్రాహ్మణులు సోమవారం నుంచి దుకాణాల బంద్ పాటిస్తున్నారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఎగ్గోజు శ్రీనివాసాచారి మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలతో ఇప్పటికే తమ దుకాణాలు నడవలేని పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముడిసరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ ఈనెల 13వరకు దుకాణాల బంద్ పాటిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సదానందచారి, నాయకులు వెంకటేశం, రాజమౌళి, లక్ష్మీనారాయణ, నర్సింహచారి, కనకచారి, సంపత్, శ్రీనివాస్, భాస్కర్, లింగమూర్తి పాల్గొన్నారు.

# వీధికుక్కల నుంచి కాపాడాలి



కారోబార్ కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

కొమురవెల్లి, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలో వీధికుక్కలు స్వైరవిహారం చేయడంతో ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం కొమురవెల్లికి చెందిన వడ్డూరి శ్రీనిద్ అనే చిన్నారి ఇంటిబయట ఆడుకుంటుండగా వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మల్లన్న జాతరకు వచ్చిన పెద్దసముద్రాలకు చెందిన చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. సోమవారం గ్రామంలో వీధి కుక్కలతో పాటు కోతులు, పందుల బెడద నుంచి నివారణ చర్యలు చేపట్టాలని గ్రామ కారోబార్ కృష్ణకు గ్రామ యువకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏర్పుల మహేశ్, గొల్లపల్లి ఆంజనేయులు, గజ్జె అశోక్, ఏర్పుల శ్రీనివాస్, సానాధి కరుణాకర్, పొట్ల చెరువుబాబు, కొయ్యడ సంజీవులు, ఎక్కలదేవి వినయ్, సార్ల వినయ్, బైరి హరీశ్, గుండా మహేశ్, దొడ్ల ప్రవీణ్, సానాది నరేశ్ పాల్గొన్నారు.



చేర్యాలలో కురుస్తున్న మంచు

## కమ్మేసిన మంచు దుప్పటి

చేర్యాల, ఫిబ్రవరి 10: చేర్యాల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం వేకువజాము నుంచి మంచు దుప్పటి కమ్మేసింది. ఉదయం 7.45గంటలు దాటినప్పటికీ చేర్యాలపై మంచు దుప్పటి తొలిగిపోలేదు. పొగ మంచు కురుస్తుండడంతో పట్టణంలోని జాతీయ రహదారిపై వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించారు. మంచు తీవ్రంగా పడుతుండడంతో ఉదయం వాకర్స్ ఇబ్బందులు పడ్డారు. మంచు దుప్పటి తొలిగిపోయిన వెంటనే సూర్య భగవానుడు కిరణాలు ప్రసరింపజేశాడు. పట్టణంలో పెద్దచెరువు అందంగా మారగా ఆ దృశ్యాలను 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది.

# గురుకులంలో నీటి కటకట

- రాంపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులు బయటకు వెళ్లకుండా సిబ్బంది ప్రయత్నం

## మిషన్ భగీరథ నీళ్లు బంద్.. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



బకెట్ల ద్వారా నీళ్లను పట్టుకుంటున్న విద్యార్థినులు



విద్యార్థినులకు నీటిని సరఫరా చేస్తున్న ట్యాంకర్

తొగుట ఫిబ్రవరి 10: విద్యార్థినులు తాగునీళ్లు లేక దాహంతో అలమటిస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు, గురుకుల సిబ్బంది చేతులెత్తేయడంతో విద్యార్థినులు అనేక కష్టాలు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే తొగుట మండలంలోని రాంపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు పూర్తిగా బంద్ చేశారు. పైపులు పగిలిపోవడంతో నీటి సరఫరాను నిలిపివేశారు. గురుకులంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గురుకులంలో నీటి సమస్యపై విద్యార్థినుల తల్లిదండ్రులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. గురుకులంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 646 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి తగ్గట్టుగా తాగు నీటి సరఫరా లేక నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల నుంచి గురుకులంలో నీటి సమస్య ఉన్నప్పటికీ ఈ విషయాన్ని బయటకు తెలువకుండా సిబ్బంది విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి పైపులైన్ పగిలిపోయి నీరు రావడం లేదు. దీంతో రోజూ విద్యార్థినులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రాంపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థిను తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ప్లాస్టిక్‌రహిత పట్టణంగా తీర్చిదిద్దుతా

సిద్దిపేట, ఫిబ్రవరి 10: సిద్దిపేట పట్టణాన్ని ప్లాస్టిక్‌రహితంగా తీర్చిదిద్దుతానని కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు వర్తక వాణిజ్య వ్యాపారస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ కూడా ప్లాస్టిక్ వినియోగం లేకుండా ప్లాస్టిక్‌రహిత పట్టణంగా మార్చుకుందామని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఏకో కవర్లను వినియోగించాలన్నారు. మున్సిపల్ సిబ్బంది అవగాహన మేరకు ఇప్పటికే పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం చాలావరకు తగ్గుముఖం పట్టిందని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నిషేధించాలన్నారు.

## హుస్నాబాద్‌లో నార్కోటిక్స్ డాగ్స్ తనిఖీలు

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 10: పట్టణంలోని పలు షాపులు, కిరాణా దుకాణాలు, బేకరీలల్లో సోమవారం సాయంత్రం నార్కోటిక్స్ డాగ్స్‌తో డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల కోసం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కొండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ యువత మత్తు, డ్రగ్స్ బానిస అవుతున్నారని, ఎవరైనా డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. షాపుల్లో విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వ్యక్తికి గాయాలు

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 10: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి మండలం గురువన్నపేటకు చెందిన బచ్చలి సత్తయ్య పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై కుకునూరుపల్లికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో కుకునూరుపల్లి బస్టాండ్ సమీపంలో కారు ఢీకొట్టింది. సమాచారం అందుకున్న 108 టెక్నీషియన్ మహేందర్, పైలెట్ రమేశ్ ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడికి ప్రథమ చికిత్స చేసి గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## మద్యంతాగి వాహనాలు నడుపొద్దు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 10: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో సిబ్బందితో కలిసి సోమవారం నర్సాపూర్, ఎంపీడీవో చౌరస్తాతో పాటు రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 16 మంది మందుబాబులు పట్టుబడ్డారని తెలిపారు. న్యాయమూర్తి కాంతారావు ఎదుట మందుబాబులను హాజరుపర్చగా రూ. 24,500 జరిమానా విధించారన్నారు. సిద్దిపేట టూటౌన్ స్టేషన్ పరిధిలో మద్యంతాగి వాహనం నడిపిన మందుబాబుకు న్యాయస్థానం రూ.1 000 జరిమానా, మూడు రోజుల జైలు శిక్ష విధించిందని సీఐ ఉపేందర్ తెలిపారు.

## కరాటే పోటీలో ఆఖీఫా ప్రతిభ



ఆఖీఫా

చేర్యాల, ఫిబ్రవరి 10: హైదరాబాద్ నగరంలోని సరూర్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఇటీవల అంతర్జాతీయ ఓపెన్ టూ ఆల్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ సెన్సాయి డా.ఎంఎస్ పాషా శిక్షణలో ఉన్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపించి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించారు. మండలంలోని కాశేగుడిసెల గ్రామానికి చెందిన షేక్ అలీఆఖీఫా ఉత్తమ ప్రతిభ చూపించి మూడో స్థానంలో నిలిచింది. చిన్ననాటి నుంచే కరాటే పోటీలో ప్రతిభ చూపిస్తున్న ఆఖీఫాను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## అప్పులు కట్టలేక ఆత్మహత్య

గజ్వేల్, ఫిబ్రవరి 10: అప్పులు కట్టలేక మద్యానికి బానిసై పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని గిరిపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బండారు రవీందర్(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం గజ్వేల్ పట్టణంలో మూడేండ్ల క్రితం ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారు లోన్ రూ.1.50లక్షలు, ఫిన్‌కేర్‌లో రూ.60 వేలు, స్పందన ఫైనాన్స్‌లో రూ.60 వేలు, గత జూలైలో ఫైవ్‌స్టార్ ఫైనాన్స్‌లో రూ.4.50లక్షల అప్పులు తీసుకున్నాడు. కొంత డబ్బును తన తండ్రి ఆరోగ్యం కోసం ఖర్చు చేయగా మిగతా డబ్బులను జల్సాలు, ఆన్‌లైన్ గేమ్‌లకు ఖర్చు చేశాడు. ప్రైవేట్ ఫైనాన్స్‌లో తీసుకున్న అప్పులు కట్టలేక మద్యానికి బానిసై ఈనెల 5న తన వ్యవసాయపొలం వద్ద పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పగా వెంటనే అక్కడి చేరుకొని రవీందర్‌ను చికిత్స కోసం గజ్వేల్ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తెల్లవారుజామున మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.